క్లుప్తంగా

మూల పెద్దమ్మ జాతరకు ఆహ్వానం



ఎమ్మెల్యే కాటసానిని ఆహ్వానిస్తున్న ఆలయ చైర్మన్, ధర్మకర్తలు

గడివేముల: స్థానిక మూలపెద్దమ్మ జాతరకు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డిని ఆహ్వానించారు. బుధవారం కర్నూలులోని ఎమ్మెల్యే ఇంటికి వెళ్లిన ఆలయ చైర్మన్ తలారి చిన్నన్న, ధర్మకర్తలు కేశవరావు, పెద్ద మాచెర్లు ఆయనకు ఆహ్వాన పత్రిక అందజేసి మూలపెద్దమ్మ పంచాంగం అందించారు.

నేడు రామదాసు తాత రథోత్సవం

గూడూరు రూరల్: మండల పరిధిలోని మునగాలలో గురువారం సాయంత్రం శ్రీరామదాసుతాత రథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామస్తులు, భక్తులు జయప్రదం చేయాలని కోరారు.

నేడు మునగాలలో కబడ్డీ పోటీలు

గూడూరు రూరల్: ఉగాది ఉత్సవాలను పురస్కరించుకుని గూడూరు మండల పరిధిలోని మునగాలలో గురువారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతిగా రూ. 8,116, రెండో బహుమతి రూ. 6,116, మూడో బహుమతి రూ. 4,116, నాలుగో బహుమతి రూ. 2,116 అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న సీఐ మన్సూరుద్దీన్

గూడూరు: రంజాన్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్ అన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. పట్టణ ప్రజలు మతసామరస్యం పాటిస్తూ సంతోషంగా పండుగ జరుపుకోవాలని సూచించారు. ఎస్ఐ హనుమంతప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ పీఎస్ అస్లామ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పెసరవాయిలో ఎన్నికల ప్రచారం

గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి గ్రామంలో గురువారం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తనయుడు శివ నరసింహారెడ్డి ఎన్నికల ప్రచారం చేయనున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్లారెడ్డి, శ్రీకాంత్ తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

కన్నడ భక్తులకు అన్నదానం



భక్తులకు భోజనం వడ్డిస్తున్న నన్నూరు గ్రామస్తులు

ఓర్వకల్లు: ఉగాది బ్రహ్మోత్సవాల సందర్భంగా కర్ణాటక రాష్ట్రం నుంచి శ్రీశైలంకు పాదయాత్రగా వెళ్లి వస్తున్న భక్తులకు నన్నూరు గ్రామస్తులు బుధవారం అన్నదానం ఏర్పాటు చేశారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్విరామంగా భోజనాలు వడ్డించారు. సుమారు 8 వేల నుంచి 9 వేల మంది కన్నడ భక్తులు భోజనాలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఐదేళ్ల నుంచి అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు.

టర్పెంటైన్ ఆయిల్ తాగి బాలుడికి అస్వస్థత



చికిత్స పొందుతున్న బాలుడితో తల్లిదండ్రులు

ఆదోని అర్బన్: తాగునీరు అనుకుని టర్పెంటైన్ ఆయిల్ తాగి ఐదేళ్ల బాలుడు అస్వస్థతకు గురైన ఘటన ఆదోని మండలం అలసందగుత్తి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన సోమన్న, సంధ్య దంపతులకు కుమారుడు అఖిల్ (5) ఉన్నాడు. బుధవారం ఇంటికి రంగులు కొట్టేందుకు టర్పెంటైల్ ఆయిల్‌ను తీసుకొచ్చి ఇంట్లో ఉంచారు. బాలుడు అఖిల్ ఆడుకుంటూ నీరు అనుకుని తాగి అస్వస్థతకు గురయ్యాడు. అపస్మారక స్థితికి చేరుకున్న బాలుడిని హుటాహుటిన ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం బాలుడి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

అమ్మకు అభయం

- గర్భం దాల్చినప్పటి నుంచే ప్రభుత్వ పర్యవేక్షణ
- ప్రసవించే వరకు క్రమం తప్పకుండా వైద్యసేవలు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏటా 50 వేల ప్రసవాలు
- వంద శాతం ఆసుపత్రుల్లోనే కాన్పులు
- నేడు జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం



బిడ్డను కంటూ ఏ తల్లీ, జన్మిస్తూ ఏ బిడ్డా మరణించకూడదన్నది రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశం. అందుకనుగుణంగా మహిళలకు గర్భం దాల్చినప్పటి నుంచే ఆరోగ్య సూచనలు అందిస్తూ, ప్రసవించిన తర్వాత తల్లీ బిడ్డల ఆరోగ్యం కోసం అహర్నిశలు కృషి చేస్తోంది. మహాత్మాగాంధీ సతీమణి కస్తూర్బా గాంధీ జయంతిని పురస్కరించుకుని 2003 నుంచి ఏటా ఏప్రిల్ 11న జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో 'సాక్షి' ప్రత్యేక కథనం..

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఆదోనిలోని ఏరియా ఆసుపత్రి, మాతాశిశు ఆసుపత్రి, కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులన్నింటిలోనూ ప్రభుత్వం డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తోంది. గర్భిణి తన ఇష్టమైన ఆసుపత్రిలో చేరి సుఖప్రసవం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటోంది. గర్భం దాల్చిన ప్రతి మహిళ పేరును వైద్య సిబ్బంది యాప్‌లో పేరు నమోదు చేయించి, ప్రసవం అయ్యేంతవరకు పర్యవేక్షిస్తున్నారు. హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించి మాతృమరణాలను అరికడుతున్నారు.

మాతృత్వ పథకాలు

జననీ సురక్ష యోజన: దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాల గర్భిణులు ఆసుపత్రిలో ప్రసవిస్తే ఆమె బ్యాంకు ఖాతాకు నగదును జమ చేస్తారు.

ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్: ప్రతి నెలా 9న సీహెచ్‌సీలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తారు. గర్భధారణ వ్యవధిలో 3 నుంచి ఆరు నెలల వరకు మాత్రమే ఈ పరీక్షలు నిర్వహిస్తారు. హైరిస్క్ గర్భిణులకు ప్రత్యేక వైద్యసేవలు అందిస్తారు.



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మాతాశిశు కేంద్రం

సుమన్: మాతాశిశు మరణాలను తగ్గించేందుకు సురక్షిత్ మాతృత్వ ఆశ్వాసన్(సుమన్) పథకాన్ని 2019 అక్టోబర్‌లో ప్రారంభించారు. పేరు నమోదు చేసుకున్న గర్భిణులకు ప్రసవం తర్వాత ఆరు నెలల వరకు తల్లీబిడ్డకు ఎలాంటి అనారోగ్య సమస్యలు వచ్చినా ఉచితంగా చికిత్స అందిస్తారు. ఇంటి నుంచి వైద్యశాలకు ఉచిత రవాణా సౌకర్యం కూడా కల్పిస్తారు.

ప్రధానమంత్రి మాతృవందన యోజన: మూడు విడతల్లో గర్భిణికి ఆర్థిక సాయం అందజేస్తారు. గర్భిణీగా పేరు నమోదు చేసుకున్న తర్వాత తొలివిడగా రూ.1,000, రెండో విడతగా ఆరు నెలల తర్వాత ఆరోగ్య పరీక్షల నిమిత్తం మరో రూ.2వేలు, ప్రసవం అనంతరం శిశువు, తల్లి ఆరోగ్య రక్షణకు చివరి విడతగా రూ.2 వేలు అందజేస్తారు.

మాతృమరణాలు తగ్గుముఖం

రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చర్యల కారణంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత నాలుగేళ్లలో మాతృమరణాలు తగ్గుముఖం పట్టాయి. 2019–20లో 63,453 మంది ప్రసవించగా 40, 2020–21లో 62,817 మంది ప్రసవించగా 28 మంది, 2021–22లో 46,586 మంది ప్రసవించగా 30 మంది, 2022–23లో 51,142 మంది ప్రసవించగా 13 మంది, 2023–24లో కేవలం కర్నూలు జిల్లాలో మాత్రమే 28,970 మంది ప్రసవించగా 10 మంది మాత్రమే మృతిచెందారు.

పెరిగిన ఆసుపత్రి ప్రసవాలు

ప్రతి గర్భిణీ ఆసుపత్రిలోనే పురుడు పోసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తద్వారా 2019–20లో 63,143(99.49శాతం), 2020–21లో 62,800(99.47శాతం), 2021–22లో 46,701(99.90శాతం), 2022–23లో 51,402, 2023–24లో కేవలం కర్నూలు జిల్లాలో 28,108 ప్రసవాలు ఆసుపత్రుల్లోనే జరిగాయి.

రక్తహీనత నివారణకు చర్యలు

రక్తహీనత నివారణకు గర్భం దాల్చిన వెంటనే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఇస్తున్నారు. తీవ్ర రక్తహీనత ఉన్న గర్భిణులకు ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్లు ఎక్కిస్తున్నారు. 7 శాతం లోపు ఉంటే వారికి రక్తం ఎక్కించి ప్రసవ సమయంలో ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నారు. 2019–20లో 75,059(95.67శాతం) మందికి, 2020–21లో 84,372(100.44శాతం) మందికి, 2021–22లో 47,994(103.71శాతం) మందికి, 2022–23లో 50,270(96.5శాతం) మందికి, 2023–24లో కేవలం కర్నూలు జిల్లాలో 31,208(98శాతం) మందికి ఐరన్‌ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందజేశారు.

మాతృమరణాలు అరికడతాం



హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి వారికి మెరుగైన వైద్య సేవలు అందించి మాతృ మరణాలను అరికడతాం. వైద్యాధికారి నుంచి ఏఎన్ఎం వరకు గర్భిణిని పర్యవేక్షించి వారం ముందుగానే ఆసుపత్రిలో చేర్పించి సుఖప్రసవమయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. మాతృమరణాలపై ప్రతి నెలా సమీక్ష నిర్వహించుకుని పొరపాట్లు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్, డీఎంహెచ్ఓ, కర్నూలు



హోరాహోరీగా తలపడుతున్న పొట్టేళ్లు



వల్లెలాంబదేవి పార్వేట ఉత్సవం

ఘనంగా ముగిసిన శ్రీవల్లెలాంబ తిరునాల

- హోరాహోరీగా పొట్టేళ్ల పోటీలు

కోడుమూరు రూరల్: కోడుమూరులో వెలసిన శ్రీవల్లెలాంబదేవి తిరునాల బుధవారం పార్వేట, వసంతోత్సవం కార్యక్రమాలతో ఘనంగా ముగిశాయి. అమ్మవారి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన పొట్టేళ్ల పోటీలు హోరాహోరీగా సాగాయి. కర్నూలు జిల్లాతో పాటు, ఇతర జిల్లాల నుంచి 30 పొట్టేళ్లు పోటీలో తలపడ్డాయి. తెలంగాణలోని ఐజకు చెందిన నరసింహులు పొట్టేలు విజేతగా నిలిచి రూ.20 వేలను కైవసం చేసుకుంది. అలాగే 2,3వ స్థానాల్లో నంద్యాలకు చెందిన చోటు, కాళీకి చెందిన పొటేళ్లు నిలిచాయి. రూ.15వేలు, రూ.10వేలు చొప్పున అందజేశారు. 4వ స్థానంలో ఐజకు చెందిన ప్రవీణ్ పొట్టేలు రూ.8వేలు, 5వ స్థానంలో బైరవ్, నాగరాజులకు చెందిన పొట్టేళ్లు సంయుక్తంగా నిలిచాయి. పొట్టేళ్ల యజమానులకు ఆలయ కమిటీ సభ్యులు దాతల సహకారంతో నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ప్రవీణ్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లారెడ్డి, హనుమంతు, రమేష్‌నాయుడు, హనుమంతు, శివరాముడు, లింగన్న, రాఘవేంద్ర, రవి, పూలవాసు, శ్రీనివాసులు, సాలప్ప తదితరులు పాల్గొన్నారు.



పొట్టేళ్ల పోటీలను ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

వైభవంగా గిడ్డాంజనేయస్వామి ప్రభోత్సవం



స్వామివారిని దర్శించుకుంటున్న కుడా చైర్మన్ కోట్ల హర్ష, ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్



ప్రభోత్సవంలో భక్తులు

కోడుమూరు రూరల్: వెంకటగిరి గ్రామంలో శ్రీగిడ్డాంజనేయస్వామి ప్రభోత్సవాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి నిత్య కైంకర్యాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ప్రభపై కొలువుదీర్చి గ్రామంలోని దస్తగిరయ్య కట్ట వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి తిరిగి దేవాలయం వద్దకు చేర్చారు. అంతకుముందు కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ నాయకులు గోపాల్‌రెడ్డి, తిమ్మారెడ్డి, పాలగిడ్డయ్య, రాముడు, వెంకటేశ్వరరెడ్డి, గిడ్డయ్య, వెంకటశివుడు, మద్దిలేటి, గిరిబాబు, నాగేశ్వరరావు, దుబ్బన్న, హనుమంతు పాల్గొన్నారు.

టోఫెల్ పరీక్షల తనిఖీ

సి.బెళగల్: ఆంగ్ల భాషలో విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచేందుకు మూడు నుంచి ఐదో తరగతి విద్యార్థులకు బుధవారం టోఫెల్ ప్రిపరేటరీ సర్టిఫికేషన్ పరీక్ష నిర్వహించారు. మండలంలోని 15 పాఠశాలల్లో జరిగిన ఈ పరీక్షలను ఎంఈఓ జ్యోతి తనిఖీ చేశారు. కంబదహాల్ మెయిన్ స్కూల్‌లో జరిగిన పరీక్షను తనిఖీ చేసి హెచ్ఎం నాగన్న, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. కాగా మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కొత్తకోట, సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్, గుండ్రేవుల, గొల్లలదొడ్డి యూపీ స్కూళ్లతో పాటు 10 ప్రాథమిక పాఠశాలల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 1,396 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఎంఈఓ తెలిపారు.



కంబదహాల్ మెయిన్ స్కూల్‌లో ఎంఈఓ జ్యోతి

రమణీయం.. సుబ్బరాయుడి గ్రామోత్సవం



వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



గ్రామోత్సవంలో ఆలయ సిబ్బంది

పాణ్యం: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కొత్తూరులోని శ్రీవళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం స్వామివారికి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం వివిధ పుష్పాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాల మధ్య గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ రామకృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సి.బెళగల్‌లో నల్లారెడ్డిస్వామిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా గ్రామోత్సవం

సి.బెళగల్: ఉగాది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలు ఆలయాల్లో గురువారం గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు. బుధవారం వేకువజామున స్థానిక దాసరి వీధిలోని చింతలముని రంగస్వామి, మాలవీధిలోని నల్లారెడ్డిస్వామి ఆలయాల నుంచి ఉత్సవ విగ్రహాలను అశ్వం సారథ్యంలో పల్లకీలో తూర్పు, పడమటి ఆంజనేయస్వామి ఆలయాలకు, కొటారుమిట్టలోని రంగస్వామి ఆలయాల వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి పూజలు నిర్వహించారు.



చింతల మునిరంగస్వామి గ్రామోత్సవం

జాతరో జాతర

- మూలపెద్దమ్మ జాతర ప్రారంభం
- బోనాలు సమర్పించిన భక్తులు



మూలపెద్దమ్మకు బోనాలు తీసుకెళ్తున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గడివేముల: మూలపెద్దమ్మ జాతర బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. భక్తులు ఊరేంగిపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అంతకు ముందు అమ్మవారిని వివిధ పుష్పాలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. ఆకుపూజ, కుంకుమార్చన చేశారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ చైర్మన్ చిన్నన్న, ఈఓ మోహన్ ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పాణ్యం సీఐ నల్లప్ప ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. జాతరలో ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద పిల్లలు, పెద్దలు వివిధ వస్తువులను కొనుగోలు చేశారు. జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో ఉచితంగా మెడికల్ క్యాంపు, ఉచిత మినరల్ వాటర్ సదుపాయం కల్పించారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో గుండు, తాడు లాగు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

13న సీతారాముల కల్యాణం

కర్నూలు కల్చరల్: ఈనెల 13న నగరంలోని మున్సిపల్ ఎగ్జిబిషన్ హైస్కూల్ గ్రౌండ్‌లో సీతారాముల కల్యాణం ఉంటుందని ఉత్సవ సమితి అధ్యక్షుడు కె.క్రిష్టన్న తెలిపారు. బుధవారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం సాయంత్రం 6 గంటలకు గోశాలలో తలంబ్రాల సేవ, శుక్రవారం స్వామి వార్లకు తిరుమంజన సేవ ఉంటుందన్నారు. శనివారం సాయంత్రం సీతారాముల కల్యాణం ఉంటుందన్నారు. సమావేశంలో సమితి ఉపాధ్యక్షులు ఎస్వీ నారాయణరెడ్డి, మహాబలేష్, కార్యదర్శి ఎమ్.నాగోజిరావు, కోశాధికారి కల్కిమురళి, సంయుక్త కార్యదర్శులు ఎస్. నటేష్‌కుమార్, గోపీనాథరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పాణ్యం: బైక్ అదుపు తప్పడంతో యువకుడు గాయపడిన ఘటన మండల పరిధిలోని కొణిదేడు గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. అతన్ని చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చలివేంద్రం ఏర్పాటు

ఓర్వకల్లు: మండల కేంద్రానికి చెందిన విరివింటి నరసింహయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు రవికిరణ్, ఫణిశశాంకశర్మ సహకారంతో ఓర్వకల్లు ఆర్టీసీ బస్టాండ్ వద్ద బుధవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఫణిశంకరశర్మ, పద్మావతమ్మ, గ్రామ పెద్దలు శంకర్‌రెడ్డి, నాగలింగేశ్వరరెడ్డి, విష్ణుశర్మ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా రాతిదూలం పోటీలు

పాణ్యం: ఉగాదిని పురస్కరించుకుని మండలంలోని కొత్తూరు సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయ సమీపంలో బుధవారం రాతిదూలం పోటీలను పాణ్యం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సూర్య నారాయణరెడ్డి ప్రారంభించారు. తిలకించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. పోటీల్లో 24 వృషభరాజములు పాల్గొననున్నాయి. విజేతలకు వరుసగా రూ.50వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ. 15వేలు, రూ.12 వేలు, రూ.10వేలు, రూ.8 వేలు, రూ.5 వేల చొప్పున అందజేయనున్నారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి సుధాకర్, ప్రతాప్‌రెడ్డి తదతరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సూర్యనారాయణరెడ్డి

మార్గదర్శకాలు పాటించాలి



మాట్లాడుతున్న పాణ్యం ఆర్వో/జేసీ మౌర్య

కల్లూరు: ఎన్నికల కమిషన్ ఇచ్చిన మార్గదర్శకాలను పాటించాలని పాణ్యం నియోజకవర్గ ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్య అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక గుత్తి రోడ్డులోని కేఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో పాణ్యం నియోజకవర్గ ఎన్నికల పీఓ, ఏపీఓలకు విధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జేసీ.. పోలింగ్ రోజున ఈవీఎంలను కనెక్ట్ చేసుకోవడం, తొలగించడం, మాక్ పోల్ నిర్వహణ, మాక్ పోల్ స్లిప్స్ నిర్వహణ, మాక్ పోల్ క్లియర్, పోలింగ్ యంత్రాల పనితీరుపై అవగాహన కల్పించారు. పోలింగ్ పూర్తయిన వెంటనే కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్ మిషన్లు, వీవీ ప్యాట్ స్లిప్స్ స్ట్రాంగ్ రూమ్‌కు చేర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కల్లూరు, ఓర్వకల్లు, పాణ్యం, గడివేముల మండలాల తహసీల్దార్లు, పీఓలు, ఏపీఓలు, సెక్టార్ ఆఫీసర్లు, బీఎల్ఓలు పాల్గొన్నారు.